క్లుప్తంగా

ప్రత్యేక నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న రామునాయక్

రామగుండం: మున్సిపల్‌లోని వార్డు, డివిజన్ అభివృద్ధికి రూ.50లక్షల చొప్పున కేటాయించాలని మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ బూక్య రామునాయక్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్‌కు హెల్త్‌కార్డులు జారీ చేయాలని, నిలిచిన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పునరుద్ధరించాలని, మహిళా కౌన్సిలర్లు తమ ప్రాంతాల్లో పర్యటించేందుకు స్కూటీలు అందించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ అమ్రీన్ ఫాతిమా సలీంబేగ్, బెల్లంపల్లి కౌన్సిలర్ కొక్కెర చంద్రశేఖర్, చిట్యాల మధు, గౌస్ ఉన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి గణపతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రకృతితో మమేకమయ్యేలా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా హిందూ పండుగలు నిర్వహిస్తామని గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ అన్నారు. రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందన్నారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రాప్‌లోన్ కోసం బారులు



వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది రైతులు బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ- ఏడీబీ(అగ్రికల్చర్ డెవలప్ మెంట్ బ్యాంకు)లోకి తరలివచ్చారు. క్రాప్ లోన్ కోసం దరఖాస్తు చేసేందుకు బారులు తీరారు. దశలవారీగా రుణమాఫీ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మళ్లీ రుణాలు తీసుకునేందుకు అన్నదాతలు బ్యాంకుల బాట పట్టారు. స్థానిక ఎస్‌బీఐలో కిక్కిరిసిన రైతులను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పోచమ్మకు బోనం



ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లిలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారికి ఆలయానికి చేరుకున్నారు. పోచమ్మకు బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సైబర్ మోసానికి గురైతే సమాచారం ఇవ్వండి



అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణమూర్తి

పెద్దపల్లిరూరల్: సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ కృష్ణమూర్తి సూచించారు. పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు రకరకాల ఆకర్షణలతో ఆర్థిక దోపిడీకి పాల్పడతారని, ఆన్‌లైన్ మోసాలు అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సిబ్బంది శంకర్, ప్రశాంత్, మౌనిక, వెంకటేశ్ ఉన్నారు.

రాయితీపై ట్రాక్టర్ అందజేత

పెద్దపల్లిరూరల్: రైతుమిత్ర ఫౌండేషన్ ద్వారా పెద్దపల్లిలో బుధవారం 50శాతం రాయితీపై కానుగల రమేశ్ అనే రైతుకు ట్రాక్టర్ అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ సిద్ధం మధుకర్, మేనేజింగ్ డైరెక్టర్ జాఫర్, క్లస్టర్ మేనేజర్ శేషుకుమార్, మజార్, అశోక్ ఉన్నారు.

జిల్లాకే ఆదర్శం 'ఖని' పాఠశాల

- అధిక విద్యార్థులున్న స్కూల్‌గా గాంధీపార్క్ పాఠశాలకు గుర్తింపు



గాంధీపార్క్ ప్రభుత్వ పాఠశాల భవనం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని గాంధీనగర్‌లోని గాంధీపార్క్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కార్పొరేట్ స్కూల్‌కు ఉన్న డిమాండ్ ఉంది. జిల్లాలోనే అత్యధికంగా విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలగా గాంధీపార్క్ పేరొందింది. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రతీ ఏటా సొంత ఖర్చులతో ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాల ద్వారా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల ప్రయోజనాలను వివరిస్తూ అడ్మిషన్లన పెంపునకు కృషి చేస్తున్నారు. గతంలో 8గదులు 80 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాల ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం 17గదులతో 410 మంది విద్యార్థులకు చేరుకుంది. 2024లో 6వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలలో ఒక్క గాంధీపార్క్ పాఠశాల నుంచే 24మంది అంతర్గాం మండలం లింగాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందారు. ఉత్తమ బోధనకు నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు చెరుకూరి స్వరూప్‌చంద్ 2017లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. సమ్మర్‌లో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండేందుకు కొత్త ఆలోచనా విధానంతో వివిధ రకాల ఆటలతో పాటు చదువు కొనసాగించేందుకు పిల్లల సందడి అనే 3 నెలల ప్రోగ్రాంను వలంటీర్ల ద్వారా నిర్వహించారు. అప్పటి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్వరూప్ చంద్‌ను సన్మానించి ప్రశంసించారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌లో ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్, మున్సిపల్ అధికారులు బుధవారం సందర్శించారు. డివిజన్‌లోని మల్కాపూర్, శ్రీనగర్ కాలనీ, సాయిరాం కాలనీలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో స్థానిక డీసీసీ కార్యదర్శి ఎండీ రహీం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు తెలియజేశారు. ఎమ్మెల్యే సత్వరమే స్పందించి మున్సిపల్, ఎన్టీపీసీ రామగుండం సీఎస్సార్ అధికారులు వెంటనే డివిజన్‌లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు డివిజన్‌లో పర్యటించారు. భూ ర్వాసిత, ప్రభావిత ప్రాంతమైన 5వ డివిజన్ పరిధిలో ఉన్న పలు ప్రధాన సమస్యలను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో వరద కాలువలో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయించడంతో పాటు శాశ్వతంగా సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు, డీసీసీ కార్యదర్శికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ అధికారులు రామన్, హన్మంత్‌రావు నాయక్, శానిటేషన్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వర్, వార్డు ఆఫీసర్ రజిత, ఎన్టీపీసీ సీఎస్సార్ అధికారి సూర్యనారాయణ, ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు భూమి కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

మంథని: మంథనిలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల సొంత భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఐదేళ్లుగా అద్దె భవనంలో సరైన సౌకర్యాలు కేవలం రెండు గ్రూపులతోనే కళాశాల నడుస్తోందని మంత్రికి వివరించారు. ఆట స్థలం, ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గెస్ట్ అధ్యాపకులకు పే స్కేల్ లేదా టైం స్కేల్ ఇప్పించాలని కోరారు. అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు.

న్యాయవాదులకు బార్ అసోసియేషన్ సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న కౌన్సిల్ సభ్యుడు

ధర్మారం: మండలంలోని నందిమేడారం జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులకు బుధవారం రాష్ట్ర బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌రావు అసోసియేషన్ సర్టిఫికెట్లు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశం, సీనియర్ ఈసీ సభ్యులు గడ్డం లింగారెడ్డి, ఈదుల ప్రదీప్‌రెడ్డి, అల్చర్ కార్యదర్శి బీమారపు సంపత్, న్యాయవాదులు గణేశ్, రజిత పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పరామర్శించారు. కాలనీ అల్లూరుకు చెందిన బొగ్గుల చిన్నయ్య, సంతోష్‌నగర్‌కు చెందిన బొద్దుల రమ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. టీ2 క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సింగరేణి కార్మికుడు దామోదర్ బుధవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, నాయకులు ఉన్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో హనుమానాయక్

మంథని: మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమానాయక్ సందర్శించారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. రికార్డులను తనిఖీ చేశారు.

భారీ వర్షాలకు కుంగిన కల్వర్టు పరిశీలన

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిలో పాలవాగుపై నిర్మించిన కల్వర్టు భారీవర్షాల కారణంగా కుంగిపోయింది. పుట్నూర్ నుంచి కండిగుట్ట మీదుగా అంతర్గాం మండలం ఎక్లాస్‌పూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై గల కల్వర్టు మీద మట్టి కొట్టుకుపోయి పెద్ద గుంత ఏర్పడింది. విషయాన్ని పుట్నూర్ గ్రామానికి చెందిన వైద్య నరేశ్ అనే యువకుడు మండల అధికారులకు తెలియజేశాడు. దీంతో మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీశాఖాధికారి శివయ్యతో పాటు ఎంపీడీవో శశికళ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రయాణికులు గమనించేలా స్థానికంగా రహదారికి ఇరువైపులా ముళ్లకంచె ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీవో సుదర్శన్, కార్యదర్శి సుమలత ఉన్నారు.

ప్రతీ విషయంపై అవగాహన కల్పించాలి



రైతుల వేషధారణలో విద్యార్థులు

సుల్తానాబాద్: సమాజంలో జరిగే ప్రతీ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో కూరగాయల మార్కెట్‌లో జరిగే క్రయవిక్రయాలపై బుధవారం అవగాహన కల్పించారు. పాఠశాలలో రైతుబజార్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు రైతుల వేషధారణతో కూరగాయలు అమ్మిన విధానం ఆకట్టుకుంది.

ఉత్తమ టీచర్‌గా శంకర్



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ జెడ్పీహెచ్ఎస్ నర్సింహపురం న్యూమారేడుపాక ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న పెద్ది శంకర్ 2023–2024కు గాను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించనున్న ఉపాధ్యాయుల దినోత్సవంలో అవార్డు అందుకోనున్నారు.

సంక్షిప్త వార్తలు

● దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీఈవో మాధవి తెలిపారు. ఈనెల 5 నుంచి 7వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబరు 92464 62324ను సంప్రదించాలని సూచించారు.

● కరాటే విజేతలకు అభినందన

పెద్దపల్లిరూరల్: కరీంనగర్‌లో జరిగిన కరాటే పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం అభినందించారు. మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన 13మంది విద్యార్థులు, క్రిసెంట్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు మాస్టర్ సతీశ్‌ను అభినందించారు.

● ప్రభుత్వ మెనూ పాటించాలి

పాలకుర్తి: ప్రభుత్వ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని పాలకుర్తి మండల ప్రత్యేకాధికారి శివయ్య ఆదేశించారు. మండలంలోని పుట్నూర్ గ్రామ శివారులో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, జయ్యారంలోని ఎస్సీ బాలుర వసతి గృహాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా హాస్టళ్లలో భోజన నిర్వహణ తీరును పరిశీలించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో సుదర్శన్, పుట్నూర్ కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

మంథని: 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంథని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. విద్యాలయంలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తులు స్వీకరించి, కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీసీలో 5, బైపీసీ విభాగంలో 11 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లలు వెంట తీసుకురావాలని సూచించారు.

● గురుకుల సిబ్బంది తొలగింపు సరికాదు

ధర్మారం: గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం బోధన, బోధనేతర సిబ్బందిని తొలగిస్తూ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని బాలుర పాఠశాల కళాశాల టీజీపీఏ జిల్లా వైస్ చైర్మన్ దేవి రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

● దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ) ఒకేషనల్ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ దేవసేన తెలిపారు. మార్చి 2024లో పదో తరగతి పాసై ఆసక్తి ఉన్న విద్యార్థులు 6వ తేదీలోగా ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్సులు తీసుకుని విద్యాలయానికి రావాలని ఆమె సూచించారు.

● నియామకం

జ్యోతినగర్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అనుబంధ ఆల్ ఇండియా అన్‌ఆర్గనైజ్డ్ వర్కర్స్, ఎంప్లాయిస్ కాంగ్రెస్ కమిటీ రామగుండం కార్పొరేషన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా దాసరి స్వప్న నియామకమైంది. రాష్ట్ర చైర్మన్ కౌశల్ నియామక ఉత్తర్వులు బుధవారం స్వప్నకు అందించారు.

● ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రిలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎల్లంకి రాజన్న, డాక్టర్ రమాదేవి, వాసవి క్లబ్ అధ్యక్షులు అక్కినపల్లి సత్యనారాయణ, జోన్ చైర్‌పర్సన్ యాంసాని సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

● బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు సుమలత, శైలజ, సంబయ్య, సంపత్‌రెడ్డిని విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ వెంకటరమణారెడ్డి, హెచ్ఎం శోభన్‌రావు పాల్గొన్నారు.

● చికిత్స పొందుతూ టెన్త్ విద్యార్థి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు చందపల్లికి చెందిన టెన్త్ విద్యార్థి కొత్తపల్లి జశ్వంత్ (16) హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. తల్లి మందలించిందనే మనస్తాపంతో గతనెల 12న జశ్వంత్ పురుగులమందు తాగాడు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● యువకుడిపై మాజీ సైనికుడి దాడి

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఎక్స్ ఆర్మీ సుమన్‌రాజ్ బుధవారం పట్టణంలోని జవహర్‌నగర్‌కు చెందిన చందుపై దాడి చేశాడు. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం సుమన్‌రాజ్‌కు స్నేహితుడైన చందును బుధవారం మద్యం సేవిద్దామని ఫోన్ చేసి పిలవగా చందు అతని స్నేహితుడితో కలిసి సుమన్‌రాజు ఇంటికి వెళ్లాడు. మద్యం సేవించిన అనంతరం సుమన్‌రాజ్ వ్యక్తిగతంగా మాట్లాడాలని చందును ఇంట్లోకి తీసుకెళ్లి దాడి చేశాడు. సమీప బంధువులు, స్నేహితులు తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా చందు రక్తం మడుగులో ఉన్నాడు. నిందితుడు పరిపోయాడు. చందును సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులను సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

● పంచాయతీ కారోబార్ మృతికి సంతాపం

కాల్వశ్రీరాంపూర్: ఇటీవల వరదల్లో గల్లంతై మృతి చెందిన మండలంలోని మీర్జంపేట పంచాయతీ కారోబార్ చెప్యాల పవన్ మృతికి మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం మండల స్థాయి అధికారులు, కార్యాదర్శులు సంతాపం తెలిపారు.



రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా శివాజీనగర్ కాలనీకి చెందిన డ్రైనేజీలో బురద నిండిపోయింది. దీంతో మూడురోజులుగా మురుగు నీరు రైల్వేస్టేషన్ ప్రధాన రహదారిపై నుంచి పారుతోంది. సంబంధిత అధికారి స్పందించి నిర్మాణ దశలో ఉన్న ప్రధాన డ్రైనేజీ పనులను సత్వరమే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, సెల్ నెం.98499 05878

వాట్సప్ చేయండి..

మా ఫోన్ నంబర్: 97053 46608

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

సింగరేణి క్రీడలకు పెద్దపీట వేస్తోంది



క్రీడలను ప్రారంభిస్తున్న జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు

రామగిరి: సింగరేణి క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో రాణించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సెంటనరీకాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగాణంలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 2024–25 వార్షిక క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. అనంతరం జీఎంలు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా క్రీడల నిర్వహణకు పెద్దపీట వేస్తోందన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య, అధికారుల సంఘం ప్రతినిధులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, టి.నాగేశ్వర్‌రావు, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, గౌరవ కార్యదర్శి వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పీవో మతీన్ హుస్సేన్, కో ఆర్డినేటర్ కె.వి.నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సమర్థవంతమైన అధికారిని కోల్పోయాం



నివాళి అర్పిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: ఎస్వోటూ జీఎం ఎస్.వెంకటేశ్వర్‌రావు మనమధ్య లేకపోవడం బాధాకరమని, సమర్థవంతమైన అధికారిని కోల్పోయామని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఎస్.వెంకటేశ్వర్‌రావు చిత్రపటం వద్ద బుధవారం పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. జీఎం మాట్లాడుతూ తక్కువ కాలం ఏరియాలో పనిచేసినప్పటికీ అందరితో చనువుగా ఉంటూ మంచి అధికారిగా పేరుతెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, డీజీఎం పర్సనల్ ఎస్.అనిల్‌కుమార్, ఏరియా సర్వే అధికారి బుక్య దేశాయ్ పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

గోదావరిఖని: పండుగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేశ్ సూచించారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ చతుర్థి, మిలాద్ ఉన్ నబీ పండుగల దృష్ట్యా ఎవరికీ ఇబ్బంది కలగకుండా పండుగలు జరుపుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: జీడీకే–5 ఓసీపీల్లో ప్రయివేట్ ఓబీ పనులు నిర్వహిస్తున్న పీసీ పటేల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు ఎంఏగౌస్ డిమాండ్ చేశారు. పీసీపటేల్ యాజమాన్యానికి బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. కంపెనీలో బ్లాస్టింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో అదనపు పనిచేయించుకుంటున్నారని ఆరోపించారు. కార్మికులకు సీఎంపీఎఫ్, ఈఎస్ఐ, కార్మిక బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. మెస్ చార్జీతో పాటు క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. హైపవర్ కమిటీ వేతనాలు లేదా స్కిల్డ్, హైస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, బ్లాస్టింగ్ కార్మికులకు లాభాల్లో వాటా, దసరా పండుగ అడ్వాన్సు, దీపావళి పండుగ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్లాస్టింగ్ సెక్షన్ నాయకులు శివకుమార్, సమయ్య, సంపత్, రాజనర్సు, తిరుపతి, గట్టయ్య, ఊదరి రవి, మేకల సంపత్, పుల్లయ్య, నర్సింగ్, శ్రీకాంత్, జనగామ స్వామి పాల్గొన్నారు.

పెండింగ్ ఉపకార వేతనాలు వెంటనే చెల్లించాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో బుధవారం ఆయన మాట్లాడారు. నాయకులు దినేశ్, శశాంత్, సాయిచరణ్, శివనాథ్ ఉన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలి

జూలపల్లి: ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి, పెండింగ్ స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ, స్టూడెంట్స్ ఫర్ సేవ (ఎస్ఎఫ్ఎస్) జిల్లా కన్వీనర్ సందెనవేణి ఓమేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. విద్యార్థి నాయకులు అఖిల్, హరీశ్, అనిల్, రాజు ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

గోదావరిఖనిటౌన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.8500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఏబీవీపీ గోదావరిఖని నగర ఇన్‌చార్జి సిద్ధార్థ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడారు.

కొవ్వొత్తుల ర్యాలీ

గోదావరిఖని: అభయపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం రాత్రి స్థానిక ఫైలాన్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.